# పురుషసూక్తము

**ఓం తచ్ఛం యోరావృణీమహే । గాతుం యజ్ఞాయ । గాతుం యజ్ఞపతయే । దైవీ స్వస్తిరస్తు నః ।**
**స్వస్తిర్మానుషేభ్యః । ఊర్ధ్వం జిగాతు భేషజమ్ । శం నో అస్తుద్విపదే । శం చతుష్పదే ।**
**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥**

**తాత్పర్యము** :- ప్రాప్తించిన రోగాదులకు వుపశమనకారణమును, రాబోవు రోగాదులకు నివారణ కారణమును అగు అరుణకేతుక మను పేరుగల కర్మను అభిముఖమున ప్రార్థించుచున్నాను. ఆ అరుణకేతుక మందు అనుష్ఠింపబడబోవు క్రతువు యోగ్యముగ ప్రవర్తిల్లుటకు అభిముఖమున ప్రార్థించుచున్నాను. యజ్ఞపతియగు యజమానికి అనుకూల ఫలప్రాప్తికై అభిముఖమున ప్రార్థించుచున్నాను. మాకు దేవతలచే సంపాదింపబడిన క్షేమము కల్గుగాక! మా పుత్త్రాదులకు క్షేమము కలుగుగాక! ఇటుపైన సర్వానిష్టనివారణమును పొందుదునుగాక! మా మనుష్యులకును, సుఖముకల్గుగాక! మా పశువులకును సుఖము కలుగుగాక! ప్రణవమున ప్రతిపాదింపబడిన ఓ పరమాత్మా! జ్వరశిరోవ్యాధులవలన కల్గు ఆధ్యాత్మికతాపముచే మాకు కల్గు విఘ్నములు శాంతించునుగాక! చోరవ్యాఘ్రాదుల వలన కల్గు ఆధిభౌతిక తాపముచే మాకు కల్గు విఘ్నములు శాంతించునుగాక! యక్షరాక్షసాదులవలన కల్గు ఆధిదైవికతాపముచే మాకు కల్గు విఘ్నములు శాంతించునుగాక!

**ఓం సహస్ర శీర్ షాపురుషః । సహస్రాక్ష స్సహస్రపాత్ । సభూమింవిశ్వతో వృత్వా । అత్యతిష్ఠ ద్దశాఙ్గులమ్**
**॥ పురుష ఏవేదగ్ంసర్వమ్ । యద్భూతంయచ్చభవ్యం । ఉతామృతత్వ స్యేశానః । యదన్నేనాతిరోహతి ॥**
**ఏతావానస్యమహిమా । అతో జ్యాయాగ్ంశ్చ పూరుషః ॥ 1**

**తాత్పర్యము** :- మనకు కనుపించు యీ ప్రపంచమంతయు పరమాత్మయొక్క విరాడ్రూపము. కాన ఆ పరమాత్మ ప్రపంచమందలి సమస్తజీవులలో నున్నాడు. అందువలన ఆయన అనేక శిరములు, నేత్రములు, పాదములు గలవాడని చెప్పబడును. ఆయన బ్రహ్మాండముయొక్క లోపలను, వెలుపలను వ్యాపించియున్నాడు. ఆయన పది అంగుళముల పరిమితమైన శరీరమున నుండును. ఆయనయే త్రికాలములందలి ప్రపంచముల స్వరూపుడు, దేవత్వమునకు అధీశుడగు ఆయన తన కారణావస్థను మీఱి అన్నమను కారణమున జగదవస్థను పొందును. కానీ యీ అవస్థ ఆయనకు కల్పితమే. తన మహామహిమచే ఆయన త్రికాలములయందు నుండును. కాని ఆయన యీ జగదవస్థను పొందగల్గిన శక్తికంటె మిగుల నధికమగు సామర్థ్యగలవాడు.

**పాదోఽస్యవిశ్వాభూతాని । త్రిపాదస్యామృతందివి । త్రిపాదూర్ధ్వఉదైత్పురుషః । పాదోఽస్యేహాఽఽభవాత్పునః । తతో విష్యఙ్వ్యక్రామత్ । సాశనానశనే అభి । తస్మాద్విరాడజాయత । విరాజో అధిపూరుషః । సజాతో అత్యరిచ్యత । పశ్చాద్భూమి మథోపురః ॥ 2**

తాత్పర్యము :- ఈ ప్రపంచమందలి భూతములన్నియు ఆ పరమాత్మయొక్క నాల్గవభాగముగనున్నవి. ఆయనయొక్క మిగిలిన మూడువంతులు రూపము స్వయంప్రకాశరూపమునందు నాశరహితమైయున్నది. ఆ రూపముగల పరమాత్మ జనన మారణాదియుత దేహముకంటే వేఱుగనుండి, పాంచభౌతికదేహ గుణదోషముల సంబంధము లేక, గొప్పగ నున్నాడు. మొదట చెప్పిన ఆయన నాల్గవ భాగము మాయను పొంది, సృష్టిసంహార కార్యములు చేయుచున్నది. మాయా సంబంధము కల్గిన తఱువాత దేవ, మర్త్య, తిర్యక్కులు మున్నగు చేనతాచేతనములందు వ్యాపించియున్నది. ఆ పరమాత్మనుండి విరాట్పురుషుడు పుట్టి భూమిని సృషించెను. అందలి సకల దేహములందు జీవనరూపుడుగనుండసాగెను. పిమ్మట దేవమనుష్య తిర్యక్కులు మొదలగువాని సప్తధాతువుల దేహములను సృష్టించెను.

**యత్పురుషేణహవిషా । దేవా యజ్ఞమతన్వత । వసంతో అస్యాఽసీదాజ్యమ్ గ్రీష్మఇ ధ్మ శ్శరద్ధవిః । సప్తాస్యాస న్పరిధయః । త్రిస్సప్తసమిథః కృతాః । దేవా యద్యజ్ఞంతన్వానాః । అబధ్నన్పురుషం పశుమ్ ॥ తం యజ్ఞంబర్హిషిప్రౌక్షన్న్ । పురుషంజాతమగ్రతః । 3**

తాత్పర్యము :- మొట్టమొదట విరాట్పురుషుడు దేవసృష్టి చేసెను. అంతట ఆ దేవతలు అనంతర సృష్టిచేయు సామర్థ్యమునొందుటకు ఒక యజ్ఞము చేయదలచిరి. అప్పటికి తక్కిన సృష్టి జరిగియుండనందున వారికి ఆ యజ్ఞమునకు హవిస్సులు దొరుకలేదు. కాన అప్పుడు వారు ఆ పురుష స్వరూపమునే హవిస్సుగా మనసుస భావించి, మానసయజ్ఞము సాగించిరి. అప్పుడు ఆ యాగమునకువలసిన ఆజ్యముకై వసంతఋతువును, పురోడాశము లేక హవిస్సునకు శరదృతువును, తమ మనమున భావన చేసిరి. ఆ యజ్ఞమునకు గాయత్రిమున్నగు ఛందస్సులు ఏడు మేరలుగను, ఆ యేడింటితో యేర్పడిన ఇరువదియొక్కంటిని సమిధలుగను భావించిరి. అంతవారు ఆ పురుషపశువును యూపమునకు గట్టి విశసనము చేసిరి.

**తేన దేవాఅయజంత । సాధ్యాఋషయశ్చయే । తస్మాద్యజ్ఞాత్సర్వహుతః । సంభృతం పృషదాజ్యమ్ । పశూగ్స్తాగ్ శ్చక్రేవాయవ్యాన్ । ఆరణ్యాన్గ్రామ్యాశ్చయే । తస్మాద్యజ్ఞాత్సర్వహుతః । ఋచస్సామాని జజ్ఞిరే । ఛందాగ్ ంసి జజ్ఞిరేతస్మాత్ । యజుస్తస్మా దజాయత ॥ 4**

**తాత్పర్యము** :- అట్లు దేవతలు, సాధ్యులు, ఋషులు కలసిచేసిన ఆ మానసయజ్ఞమునుండి 'పృషత్' అనెడు నేయియు సంపాదింపబడెను. వాయుదేవతాకములగు పశువులును, గ్రామములోనుండు ఆవులు మున్నగునవియు, వేదములును, గాయత్రిమున్నగు ఛందస్సులు పుట్టెను.

**తస్మాదశ్వా అజాయంత । యేకే చోభయాదతః । గావోహజజ్ఞి రేతస్మాత్ । తస్మాజ్జాతా అజావయః ।**
**యత్పురుషం వ్యదధుః । కతిధావ్యకల్పయన్ । ముఖం కిమ స్యకౌబాహూ । కావూరూ పాదావుచ్యేతే ॥**
**బ్రాహ్మణోఽస్యముఖమాసీత్ । బాహూరాజన్యః కృతః ॥ 5**

**తాత్పర్యము** :- ఆ మానసయజ్ఞమునుండి గుఱ్ఱములను, నోటిలో పై, క్రింది భాగములలో దంతములు గల గాడిదలు మున్నగునవియును, ఆవులు, మేకలు, గొఱ్ఱెలును పుట్టెను. దేవతలు విరాడ్రూపుని సంకల్పముచే పుట్టించినపుడు అనేకవిధ కల్పనలు చేసిరి. విరాట్పురుషుని ముఖము -బ్రాహ్మణుడు, బాహువులు - క్షత్రియులు.

**ఊరూత దస్యయద్వైశ్యః । పద్భ్యాగ్ం శూద్రో అజాయత । చన్ద్రమా మనసో జాతః । చక్షో సూర్యో అజాయత ।**
**ముఖాదింద్రశ్చాగ్నిశ్చ । ప్రాణాద్వాయు రజాయత । నాభ్యాఆసీ దంతరిక్షం । శీర్ణో ద్యౌ స్సమవర్తత । పద్భ్యాం**
**భూమిర్దిశశ్శ్రోత్రాత్ । తథాలోకాగ్ం అకల్పయన్ ॥ 6**

**తాత్పర్యము** :- ఆ విరాట్పురుషుని తొడలు వైశ్యులు, పాదములనుండి శూద్రుడు పుట్టెను. ఆయన మనస్సునుండి చంద్రుడును, నేత్రమునుండి సూర్యుడును, ముఖమునుండి ఇంద్రుడును, అగ్నియును పుట్టిరి. ప్రాణమునుండి వాయువును, నాభినుండి అంతరిక్షమును యేర్పడెను. ఆయన శిరమువలన స్వర్గలోకమును, పాదములవలన భూమిని, చెవులనుండి దిశలను లోకములను దేవతలు కల్పించిరి.

**వేదాహ మేతం పురుషం మహాంతమ్ । ఆదిత్యవర్ణం తమసస్తుపారే । సర్వాణిరూపాణి విచిత్యధీరః ।**
**నామానికృత్వాఽభివదన్ యదాస్తే । ధాతా పురస్తాద్యముదాజహార । శక్రఃప్రవిద్వాన్ప్రదిశ శ్చతస్రః । తమేవం విద్వా**
**నమృత ఇహ భవతి । నాన్యః పన్థాఅయనాయ విద్యతే । యజ్ఞేన యజ్ఞ మయజన్త దేవాః । తాని ధర్మాణి**
**ప్రథమాన్యాసన్ । తేహనాకం మహిమానస్సచన్తే । యత్ర పూర్వేసాధ్యాస్సన్తిదేవాః ॥ 7**

**తాత్పర్యము** :- ధీరుడై, అధికముగ సమస్త రూపములను నిర్మించి, వానికి పేళ్లు పెట్టి, అంతటను

వ్యాపించియున్న ఆ విరాట్పురుషుని మహా అధికునిగా, సూర్యకాంతి ప్రకాశవంతునిగ, నేను తెలిసికొనుచున్నాను. ఆయన అజ్ఞానమను అంధకారమునకు ఆవలనున్నాడు. ధాత బ్రహ్మచే చెప్పబడినవాడును, ఇంద్రునిచే బాగుగా నెఱుగబడిన, నలుదిక్కుల ప్రసిద్ధినొందింపబడినవాడును అగు విరాట్పురుషుని ఈ పై ప్రకారముగ తెలిసికొనిన జ్ఞానవంతుడు ఈ జన్మమునందే అమృతత్వము నొందును. మోక్షమునొందుటకు యిది యొక్కటియే మార్గము. అందువలన ఆ విరాట్పురుషుని ధర్మములు(కార్యములు) ముఖ్యములయ్యెను. ఆ విరాట్పురుషుని గూర్చిన జ్ఞానమునొందిన మహానుభావులగువారు పూర్వపు సాధ్యులు వుండబట్టి ఆ స్వర్గమును ఈ భూలోకమునందే పొందుదురు.

**అద్భ్య స్సంభూతః పృథివ్యైరసాచ్చ । విశ్వకర్మణ స్సమవర్తతాధి । తస్య త్వష్టావిదధ ద్రూపమేతి । తత్పురుషస్య విశ్వమాజానమగ్రే । వేదాహ మేతం పురుషం మహాంతమ్ । ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ । తమేవం విద్వానమృత ఇహ భవతి । నాన్యః పన్థా విద్యతేఽయనాయ । ప్రజాపతిశ్చరతి గర్భే అన్తః । అజాయమానోబహుధావిజాయతే ॥ 8**

**తాత్పర్యము** :- నారాయణుడు నీళ్లనుండి పుట్టెను. నీటినుండి పృథ్వి పుట్టెను, ఇది ముఖ్యముగ పరమేశ్వరునివలననే జరిగెను. ఈ బ్రహ్మాండమునకు పరమేశ్వరుని అంశమగు విరాట్పురుషుడు యజమాని. విశ్వకర్మయగు జగదీశ్వరుడు ఆయనకు జగద్రూపమును అనుగ్రహించెను. అట్టి విరాట్పురుషుని సృష్టియొక్క ఆదియందు సమస్త ప్రపంచము రచింపబడెను. ఇట్టి పురుషుని గొప్పవానిగను, ఆ జ్ఞానమునకు పరమున సూర్యుని వలె ప్రకాశించువాడనియు తెలిసికొని, ఆయనను ధ్యానించు మహాజ్ఞానులు ఆ భూలోకముననే అమృతత్వము నొందుదురు. అమృతత్వము నొందుటకు యింతకంటె వేఱుమార్గము లేదు. ప్రజాపతి పుట్టుకలేనివాడైనను, ఈ బ్రహ్మాండములో నున్నను, ఆయన యీ ప్రపంచమున అనేక రూపములుగ పుట్టును.

**తస్య ధీరాః పరిజానన్తి యోనిమ్ । మరీచీనాంపదమిచ్ఛన్తివేధసః । యో దేవేభ్యఆతపతి । యోదేవానాం పురోహితః । పూర్వో యోదేవేభ్యోజాతః । నమో రుచాయ బ్రాహ్మయే । రుచం బ్రాహ్మం జనయన్తః । దేవా అగ్రేత దబ్రువన్ । యస్త్యైవం బ్రాహ్మణోవిద్యాత్ । తస్యదేవాఅసన్ వశే ॥ 9**

**హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ । అహోరాత్రే పార్శ్వే । నక్షత్రాణి రూపమ్ । అశ్వినౌ వ్యాత్తమ్ । ఇష్టం మనిషాణ । అముం మనిషాణ । సర్వం మనిషాణ ॥ 10**

**ఓం శాంతి శాంతిః శాంతిః ॥**

**తాత్పర్యము** ః- జ్ఞానులు ఆ ప్రజాపతియొక్క స్వరూపము నెఱుంగుచున్నారు. బ్రహ్మలు మరీచి మున్నగువారి స్థానములను కోరుచున్నారు. దేవతలకొఱకు సర్వత్ర ప్రకాశించువాడును, దేవతల పురోభివృద్ధిని చేయువాడును, దేవతలకంటె పూర్వమే పుట్టియుండినవాడును అగు ఆ పరబ్రహ్మమునకు నమస్కారము. సృష్టియొక్క ఆదియందు సమస్తదేవతలు ఆ బ్రహ్మనుగూర్చి, ' ఓ పరమాత్మా! పైన చెప్పిన ప్రకారము తెలిసికొనిన బ్రాహ్మణునకు జ్ఞానికి సమస్తదేవతలును వశమందు వుండిరి. లజ్జాదేవియు, శ్రీలక్ష్మిదేవియు నీకు భార్యలు. రాత్రిందినములు నీకు పార్శ్వములు. నక్షత్రములు నీ రూపము, అశ్వనీదేవతలు నీకు ముఖము(తెఱువబడిన నీ నోరు). స్వామీ! మేము కోరునట్టి జ్ఞానమును ప్రసాదింపుము. ఆత్మజ్ఞానమును దయచేయుము, సర్వమైన ఐహికాముష్మికములను అనుగ్రహింపుము' అని ప్రార్థించిరి.

**ఓం తచ్ఛం యోరావృణీమహే । గాతుం యజ్ఞాయ । గాతుం యజ్ఞపతయే । దైవీ స్వస్తిరస్తు నః ।**
**స్వస్తిర్మానుషేభ్యః । ఊర్ధ్వం జిగాతు భేషజమ్ । శం నో అస్తు ద్విపదే। శం చతుష్పదే ।**
**ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥**

**తాత్పర్యము** ః- ప్రాప్తించిన రోగాదులకు వుపశమనకారణమును, రాబోవు రోగాదులకు నివారణ కారణమును అగు అరుణకేతుక మను పేరుగల కర్మను అభిముఖమున ప్రార్థించుచున్నాను. ఆ అరుణకేతుక మందు అనుష్ఠింపబడబోవు క్రతువు యోగ్యముగ ప్రవర్తిల్లుటకు అభిముఖమున ప్రార్థించుచున్నాను. యజ్ఞపతి యగు యజమానికి అనుకూల ఫలప్రాప్తికై అభిముఖమున ప్రార్థించుచున్నాను. మాకు దేవతలచే సంపాదింపబడిన క్షేమము కల్గుగాక! మా పుత్త్రాదులకు క్షేమము కలుగుగాక! ఇటుపైన సర్వానిష్టనివారణమును పొందుదునుగాక! మా మనుష్యులకును, సుఖముకల్గుగాక! మా పశువులకును సుఖము కలుగుగాక! ప్రణవమున ప్రతిపాదింపబడిన ఓ పరమాత్మా! జ్వరశిరోవ్యాధులవలన కల్గు ఆధ్యాత్మికతాపముచే మాకు కల్గు విఘ్నములు శాంతించునుగాక! చోరవ్యాఘ్రాదుల వలన కల్గు ఆధిభౌతిక తాపముచే మాకు కల్గు విఘ్నములు శాంతించునుగాక! యక్షరాక్షసాదులవలన కల్గు ఆధిదైవికతాపముచే మాకు కల్గు విఘ్నములు శాంతించునుగాక!

-------పురుషసూక్తమ్ సమాప్తమ్ -------